క్లుప్తంగా

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గండేపల్లి: కార్డియో పల్మనరీ రెసిసన్ (సీపీఆర్)తో ప్రాణాపాయం నుంచి వ్యక్తి ప్రాణాలు కాపాడవచ్చని కాకినాడ మెడికోవర్ హాస్పటల్ వైద్యులు వీజీహెచ్ జయప్రకాష్ అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదివారం కాకినాడ మెడికోవర్ హాస్పటల్స్ సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నోవేషన్ సర్జికల్ టెక్నాలజీలో గల ఆధునిక పోకడలు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) తదితర అంశాలను వివరించారు. ఎవరైనా ప్రమాదంలో గాయపడినప్పుడు, మనిషి స్పృహ కోల్పోయినప్పుడు చేయాల్సిన ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రమేష్, అడ్మినిస్ట్రేషన్ డీన్ వైకేఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధితులకు వంట, కిరాణా సామగ్రి అందజేస్తున్న దాత రాజేష్, తదితరులు

ఏలేశ్వరం: పట్టణంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు ఆదివారం దాతలు సాయం అందజేశారు. పట్టణానికి చెందిన వాగు రాజేష్ తన కుమారుడు సాత్విక్ పుట్టినరోజు సందర్భంగా బాధితులు సూరిబాబు, పూజిత దంపతులకు వంట సామగ్రి, కిరాణా, రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో బుగతా శ్రీను, సిరిఫుడ్స్ కృష్ణ, మణికంఠ, అనంతపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని రథోత్సవం



ఆలయ ప్రాంగణంలో సత్యదేవుని రథోత్సవం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో స్వామివారి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని అర్చకులు వేదికపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఏఈఓ కృష్ణారావు స్వామివారి రథోత్సవాన్ని ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ పెద్దసంఖ్యలో భక్తులు తరలిరాగా ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి తిరిగి ఆలయానికి చేర్చారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటిండెంట్ ఐవీ రామారావు, సీనియర్ అసిస్టెంట్ గణపతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యం



శంఖవరంలో డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం డ్వాక్రా సంఘాలకు రూ.3.16 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో గ్రామాల్లో కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పర్వత సురేష్, బుద్ర వాసు, ఏపీఎం వెంకట రమణ, సీసీలు నాగలక్ష్మి, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన ఘంటసాల విభావరి

సామర్లకోట: కళలను ప్రోత్సహించాలన్న సంకల్పంతో స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ ఆలయంలో సెప్టెంబర్ ఒకటిన ఆదివారం సాయంత్రం ఘంటసాల సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఘంటసాల అభిమాన సంఘ నాయకుడు చిపాడ నాగేశ్వరరావు తెలిపారు. అంతరించుకుపోతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా దీనిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి

రోగులకు అత్యవసరమైన పరిస్థితుల్లో ప్రాణాలు పోసే వైద్యులపై మానవ మృగాలు దాడులు చేయడం సిగ్గుచేటు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షిస్తే దేశంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కావు. ఇటీవల కాలంలో వైద్యులపై దాడులు పెరిగిపోయాయి. వైద్యులు, మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చి అమలు చేయాలి. వైద్యులకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలి.

– సీహెచ్ జ్యోతిమణిమాల, వైద్యాధికారి, గెద్దనాపల్లి పీహెచ్‌సీ, కిర్లంపూడి మండలం

వైద్యులకు రక్షణ కల్పించాలి



మహిళా డాక్టర్లకు తప్పనిసరిగా రక్షణ కల్పించాలి. పది మందికి ప్రాణం పోసే వృత్తిలో ఉన్న వైద్యులకు ప్రస్తుతం రక్షణ కరువైంది. ఇలాంటి పరిస్థితులలో వైద్యులు స్వేచ్ఛగా వైద్యం అందించే పరిస్థితి కల్పించడం లేదు. వైద్యులకు ఆయా ఆసుపత్రుల వద్ద భద్రత కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చీసుకోవాలి.

– వై.గీత, వైద్యురాలు, రాజపల్లి పీహెచ్‌సీ, ప్రత్తిపాడు రూరల్

ఈ-క్రాప్.. మేలు రైతుకు..

- ప్రతి పంటకు నమోదు తప్పనిసరి
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వస్తే పరిహారం
- బ్యాంకు రుణాలతో పాటు బహుళ ప్రయోజనాలు
- ఇప్పటివరకూ 50 శాతం నమోదు పూర్తి



ముక్కొల్లులో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ అమృత

కిర్లంపూడి: రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ-కాప్ నమోదు తప్పనిసరిగా మారింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్న రైతులకు ఈ-పంట నమోదుతో ఎంతో మేలు జరుగుతుంది. కిర్లంపూడి మండలంలో ఈ ఏడాది సుమారు 8123 వేల మంది రైతులు 11,132 ఎకరాల్లో ఖరీఫ్ పంట, 1500 ఎకరాలు ఉద్యాన పంటలు సాగు చేశారు. ప్రతి రైతు పండించే పంటలను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేసుకోవాలి. 15 రోజులుగా సాగుతున్న ఈ ప్రక్రియలో ఇప్పటివరకూ 50 శాతం మంది రైతులు నమోదు చేసుకున్నారు.

ఈ-పంట ప్రయోజనాలు ఇలా...

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు నేరుగా పరిహారం పొందే వెలుసుబాటు ఉంటుంది. దళారుల చేతికి బీమా పరిహారం అందదు. ప్రభుత్వమే పూర్తిస్థాయిలో రైతులు తరపున బీమా సొమ్ము చెల్లిస్తుంది. దీంతో పంట నష్టపోయినప్పుడు గతంతో ఈ-పంట ద్వారా నష్టపోయిన రైతు ఎంత మేరకు సాగు చేశాడో వివరాలు తెలుస్తాయి. పంట మార్పిడికి వీలుంటుంది. పంటల వివరాల ఆధారంగా ఉత్పత్తుల లభ్యతపై స్పష్టత వచ్చే అవకాశముంటుంది. పైగా దిగుబడులు అంచనాకు ఇది సరైన విధానం ఎరువులు, పురుగుల మందులు ఎంత మేరకు అవసరం అవుతాయో ఆయ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు తెలుస్తుంది.

బ్యాంకుల్లో పంట రుణాలు

ఈ-పంట నమోదు ప్రక్రియ ముగిసిన అనంతరం వ్యవసాయాధికారులు జారీ చేసిన ఈ-పంట ధ్రువీకరణ ద్వారా రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు పొందవచ్చు. గతంలో పంట రుణాలు పొందిన రైతులు ఈ-పంట నమోదు సర్టిఫికెట్లను ఆధారంగా చేసుకుని వాటిని రెన్యువల్ చేసుకునే సౌకర్యం ఉంది.

కౌలు రైతులకు పరిహారం

సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు పంట నష్టపరిహారం అందుతుంది. గతంలో పొలాన్ని కౌలు రైతులు కౌలకు తీసుకున్నా పంట నష్టపరిహారం మాత్రం యాజమానులకే అందేది. ప్రస్తుతం ఒకసారి కౌలు రైతు గుర్తింపు కార్డు జారీ చేస్తే, ఈ-పంట నమోదులో సదరు పొలం కౌలు రైతులకు ఇచ్చినట్లు చూపిస్తోంది. దీంతో పొలం యాజమానులకు కాకుండా నిజమైన కౌలు రౌతుల పేరు మీదే ఈ-పంట నమోదవుతుంది. పంట నష్టపరిహారం కౌలురైతులకు నేరుగా అందుతుంది.

రైతులకు ఎంతో మేలు



ఈ-పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. గతేడాది ఈ-పంట నమోదు చేసుకున్నాను. ఈ ఏడాది కూడా నమోదు చేసుకుంటాను. బ్యాంకులో రుణం వస్తుంది. విపత్తుల వల్ల పంట నష్టం జరిగితే ప్రభుత్వం ఆదుకుటుంది.

-సూరిశెట్టి లోవరాజు, రైతు, జగపతినగరం, కిర్లంపూడి మండలం

తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి



ఖరీఫ్ సీజన్‌లో ప్రతి రైతు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి. కూరగాయలు, ఉద్యానవన పంటలు, మామిడి, జీడి ఇతర పంటలకు ఈ-పంట వర్తిస్తుంది. సెంటు స్థలం నుంచి ఎంత భూమిలో పంట పండించినా నమోదు చేసుకోవాలి. వ్యవసాయ శాఖ సహాయకులు పొలాల వద్దకు వచ్చి నమోదు చేస్తారు. ప్రతి రైతు స్థానిక రైతు సేవా కేంద్రాలకు వచ్చి ఈ-కేవైసీ విధిగా చేయించుకోవాలి.

– జోకా అమృత, మండల వ్యవసాయశాఖ అధికారి, కిర్లంపూడి

30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వేలంకలో మహిళా భక్తులను ఆహ్వానిస్తున్న సత్యదీక్ష ప్రచారకర్త కృష్ణబాబు

కిర్లంపూడి: అన్నవరంలోని వీరవెంకటసత్యనారాయణస్వామి దేవస్థానంలో ఈ నెల 30న సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలు నిర్వహించనున్నట్టు సత్యదీక్ష ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు తెలిపారు. ఈ వ్రతాల్లో పాల్గొనానికి మహిళా భక్తులను ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని వేలంక, చిల్లంగి, కిర్లంపూడి, జగపతినగరం, గెద్దనాపల్లి గ్రామాల్లో ప్రచారం చేస్తూ మహిళా భక్తులకు కరపత్రాలు అందజేశారు. పూజకు వచ్చే భక్తులు కొబ్బరికాయ, అరటిపండ్లు, పువ్వులు తీసుకుని రావాలన్నారు. మిగితా పూజా సమగ్రి దేవస్థానం సమకూరుస్తుందని చెప్పారు.

28న మండల సమావేశం

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.ప్రేమ్‌సాగర్ ఆదివారం తెలిపారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మండలాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చిస్తారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



ఏలేశ్వరంలో మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



శిక్షణ పొందిన మహిళలు సర్టిఫికెట్ల పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నాయకులు

ఏలేశ్వరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆదివారం ప్రధానమంత్రి లఖ్‌పతి దిది (ప్రతి మహిళా లక్షాధికారి కావాలి) లైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి మహిళా నెలకు రూ.10 వేలు సంపాదించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం బ్యాంక్ లింకేజీ రూ.3.08 కోట్ల నగదు చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ, ఎస్‌జీవీ సుబ్బరాజు, సూతిబూరయ్య, ఏపీఎం సూర్యప్రసాద్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జీవనోపాధిపై మహిళలకు శిక్షణ

తుని రూరల్: జీవనోపాధిని మెరుగుపర్చి ప్రతి కుటుంబం లక్షాధికారి కావాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆశయాన్ని నెరవేర్చాలని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. ఆదివారం ప్రధానమంత్రి మోదీ ప్రారంభించిన లఖ్‌పతి దిది లైవ్ ప్రోగ్రాంను స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయ సంఘాల సభ్యులతో కలిసి ఎంపీపీ, ఏపీఓ, నాయకులు వీక్షించారు. అనంతరం మహిళలకు జీవనోపాధిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి కుటుంబం వార్షిక ఆదాయంలో రూ.లక్ష మిగులు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకు అవసరమైన శిక్షణ, వ్యక్తిగత రుణం, సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. మండలంలో 3512 మందిని లక్షపతి దిది కార్యక్రమానికి ఎంపిక చేయనున్నట్టు ఏపీఎం వై.సత్తిబాబు తెలిపారు. 53 ఎస్‌హెచ్‌జీ సంఘాలకు రూ.5.13కోట్ల రుణాలను నాయకులు అందజేశారు. నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

గండేపల్లి: స్థానిక మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో ఆదివారం లఖ్‌పతి దీదీ ప్రోగ్రాంను వీక్షించేందుకు లైవ్ స్క్రీనింగ్ ఏర్పాటు చేసినట్టు ఏపీఎం సన్యాసిరావు తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు శ్రీకృష్ణ రాయభారం నాటక ప్రదర్శన

తుని రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సోమవారం సాయంత్రం 5.30 గంటలకు కుమ్మరిలోవ తాండవ కాశీక్షేత్ర తపోవనంలో శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటకం ప్రదర్శించనున్నట్టు ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన చింతలపాటి శూలపాణి బృందం నాటకాన్ని ప్రదర్శిస్తుందన్నారు. ఈ నాటకంలో పాత్రదారులుగా శ్రీకృష్ణుడు (డాక్టర్ చింతలపాటి శూలపాణి), దుర్యోధనుడిగా (డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ), కర్ణుడిగా (మల్లాడి వెంకటరమణ) ధృతరాష్ట్రుడిగా (టి.వెంకట సుబ్బారావు), భీష్ముడిగా (డీఆర్‌కే మూర్తి), ద్రోణుడిగా (సీహెచ్ ప్రభాకరశాస్త్రి), రాజ నర్తకిగా డాక్టర్ వాసిరెడ్డి బిందు, ఇతర పాత్రల్లో కళాకారులు పాల్గొంటారని వివరించారు.

మరిడమ్మ అమ్మవారి వెండి పాదం అపహరణ



అన్నవరం మరిడమ్మ అమ్మవారు

అన్నవరం: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని గ్రామదేవత మరిడమ్మ అమ్మవారి కుడి కాలి వెండిపాదం అపహరణకు గురైంది. శనివారం అమ్మవారి దర్శనానికి వచ్చిన కొందరు దుండుగులు ఆలయ కమిటీ సభ్యులు ఎవరూ లేని సమయంలో దొంగిలించినట్టు భావిస్తున్నారు. చోరీకి గురైన వెండి పాదం విలువ రూ.80 వేలు ఉంటుందని అంచనా. ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాతకొట్టాంలో 23 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాంలో లోవతలుపులమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2001 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 23 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కుటుంబ సమేతంగా కలుసుకున్నారు. ఒకరికొకరు పరిచయం చేసుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన తోటి విద్యార్థి నావాబ్‌జానీ కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. సమ్మేళనానికి పూర్వ విద్యార్థులు కూనిశెట్టి సూర్యనారాయణ(వీఆర్వో), యడ్ల చెల్లారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బొంగు ఉమారావు, బాదాసాహేబ్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు ఎస్సైగా రామకృష్ణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: స్థానిక ఎస్సైగా టి.రామకృష్ణ ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా కైకలూరు రూరల్ ఎస్సైగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పని చేసిన శంకర్ ఏలూరు రేంజ్ వీఆర్‌కు వెళ్లారు. నూతన ఎస్సైకి సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ కోటనందూరు సెంటర్లో ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

జాతీయ రహదారిపై గ్రామస్తుల ధర్నా



కృష్ణవరం టోల్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు



జాతీయ రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్

కిర్లంపూడి: మండలంలోని కృష్ణవరం జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద ఆదివారం కృష్ణవరం ఎస్సీపేటకు చెందిన గ్రామస్తులు ధర్నా చేశారు. సుమారు గంటన్నర పాటు రోడ్డును నిర్బంధించడంతో మూడు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ టోల్‌ప్లాజా నుంచి వచ్చే వర్షపు నీరు కృష్ణవరం ఎస్సీపేటలోకి రావటంతో తరచూ ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన డ్రైన్‌ను పోలవరం కాలువకు కలపకుండా సగంలో వదిలేశారన్నారు. దీనికి తోడు టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిని మెరక చేయడంతో వర్షపు నీరు గ్రామాన్ని ముంచేత్తుతోందన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైన్ పనులు పూర్తిచేయడంతో పాటు ఎస్సీపేటలో రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై జి.సతీష్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని యాజమాన్యంతో మాట్లాడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై ఎస్సై సతీష్‌ను వివరణ కోరగా గ్రామస్తుల డిమాండ్లకు టోల్‌ప్లాజా యాజమాన్యం సానుకూలంగా స్పదించడంతో ఆందోళన కారులు ధర్నాను విరమించినట్టు తెలిపారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రతిఘటిస్తాం



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: వ్యవసాయ, గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ప్రతిఘటిస్తామని సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ హెచ్చరించింది. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక వినోద్ మిశ్రానగర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ వ్యతిరేకించి హైకోర్టును ఆశ్రయించిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న అదే కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం సిగ్గుచేటన్నారు. అదానీకి చెందిన మీటర్లు ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కందుల కాంత్రికుమార్, గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, గూనాపు వరాలమ్మ, చందక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం



కాకరాపల్లి శివారులో గోతులతో ప్రమాదకరంగా మారిన తుని-నర్సీపట్నం రోడ్డు

కోటనందూరు: తుని-నర్సీపట్నం రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై ఎక్కడికక్కడ పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం కురిసిన ప్రతిసారీ గుంతల్లో నీరుచేరి రోడ్డు మరింత ఛిద్రమవుతోంది. అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపునీరు గుంతల్లో చేరినప్పుడు అనేకమంది ద్విచక్రవాహనదారులు ప్రమాదాల చారిన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు కేవలం గుంతల్లో ఎర్ర జెండాను హెచ్చరికగా పెట్టి చేతులు దులుపుకుంటున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.